# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.
- ❖ గోదావరి జిల్లాల్లో ముంపు సమస్య పరిష్కారానికి సమగ్ర డిపిఆర్ రూపొందిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.
- ❖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈరోజు ప్రారంభించారు.
- ❖ భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడో టీ-20 క్రికెట్ మ్యాచ్.. ధర్మశాల వేదికగా ఈ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది.

====================

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం మక్తాపురంలో 63 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారులను ఆయన ఈరోజు ప్రారంభించారు. అదే విధంగా 32 లక్షల రూపాయలతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆత్మకూరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపడతామని, వివిధ ప్రాంతాలకు నూతన రహదారులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిల ద్వారా రక్షిత మంచినీటిని అందిస్తామని మంత్రి తెలియజేశారు.

====================

గోదావరి డెల్టా ముంపు, ఇరిగేషన్ సమస్యల పరిష్కారానికి 13 కోట్ల 40 లక్షల రూపాయల ఖర్చుతో లైడార్ సర్వే చేపడుతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా చించినాడ వద్ద 8 కోట్ల 93 లక్షల రూపాయల ఖర్చుతో చేపడుతున్న గోదావరి వరద గట్టు మరమ్మతు పనులను మంత్రి ఈరోజు

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏడాది కాలంలో గోదావరి గట్టుకు 17 కోట్ల రూపాయల ఖర్చుతో మరమ్మతులు చేపట్టామన్నారు. గోదావరి జిల్లాల్లో ముంపు సమస్య, లాకులు, గేట్ల మరమ్మతులకు సమగ్ర డిపిఆర్ రూపొందిస్తున్నామని మంత్రి రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

====================

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈరోజు ప్రారంభించారు. ఫిరంగిపురం మండలం గుండాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, రైతు కేంద్రం, మునగపాడులో తారు రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ ప్రాంతానికి నూతన పరిశ్రమలను, విద్యా సంస్థలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. వీటి ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు భూముల ధరలు పెరిగి, ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందన్నారు. గుంటూరు ప్రాంత అభివృద్ధికి సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విరామం

====================

పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్ పేయి గొప్ప ప్రజా సేవకుడని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కొనియాడారు. అటల్ - మోదీ సుపరిపాలన యాత్ర తిరుపతి జిల్లా రేణిగుంటకు ఈ సాయంత్రం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన రేణిగుంట సమీపంలోని మర్రిగుంట వద్ద వాజ్ పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామ సడక్ యోజన కార్యక్రమం కింద దేశంలో మారుమూల ప్రాంతాలకు రోడ్లను వేసిన ఘనత వాజ్ పేయిదే అన్నారు. దేశంలోని పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను వాజ్‌పేయి అమలు చేశారని పేర్కొన్నారు.

====================

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడం వల్ల చాలా మంది వాహనదారులు ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ఈ కారణంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేశామని చెప్పారు. హెల్మెట్ ఉంటేనే ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ పోసే విధంగా రేపటి నుండి నిబంధన అమలు చేస్తున్నామని, వాహనదారులు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

====================

మహిళలు స్వయం సాధికారతను సాధించేలా, ఆర్థికంగా బలపడేలా సరస్ ఎగ్జిబిషన్ రేపటి నుండి ఏర్పాటు చేస్తున్నామని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (DRDA) ఆధ్వర్యంలో 12 రోజుల పాటు ప్రదర్శన నిర్వహించేందుకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ లో పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. స్వయం సహాయక సంఘాల (SHG) మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, వారి ఆదాయ వనరులను పెంపొందించడం, గ్రామీణ మహిళల జీవనోపాధిని బలోపేతం చేయడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ వివరించారు.

====================

చిత్తూరు జిల్లా కాణిపాకంలోని స్వయంభూ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సులభతర దర్శనం టిక్కెట్లను భక్తుల కోసం ఆన్ లైన్ లో అందుబాటులోకి తీసుకువచ్చినట్టు దేవస్థానం ఈవో పెంచల కిషోర్ తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ... అధికారిక వెబ్‌సైట్‌లో సులభతర దర్శనం టిక్కెట్లను భక్తులు బుక్ చేసుకోవచ్చన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో సూచించారు.

====================

హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడో టీ-20 క్రికెట్ మ్యాచ్ ఈరోజు రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. ఐదు టీ-20 క్రికెట్ సిరీస్‌లో భాగంగా ఇప్పటి వరకు ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. దీంతో ధర్మశాల మ్యాచ్ లో గెలిచి ఆధిక్యం సాధించాలని ఇరు జట్లు పోటీపడుతున్నాయి.

====================

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్రలో రానున్న రెండు రోజుల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. కనిష్ట ఉష్ణోగ్రతలు ఒకటి, రెండు చోట్ల సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ తక్కువగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రేపు నిర్వహించనున్నామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన వివరాలను తీసుకురావాలన్నారు.

====================
====================